ఆపరేషన్ టేబుల్‌మీద పడుకోబెట్టి పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేశాడు

"ఇన్‌స్పెక్టర్‌గారూ నేను డాక్టర్ విశాల్‌ని మాట్లాడుతున్నాను. పది నిముషాల క్రితం కోర్టు దగ్గిర యాక్సిడెంట్ చేశాను".

"మీరేనా?" అట్నుంచి అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఆక్సిడెంట్ జరిగిన మనిషిని టాక్సీలో ఎక్కించుకుని వెళ్ళిపోయారని అక్కడ జనం చెప్పారు. రాళ్ళతో కారు అద్దాలు బ్రద్దలు కొట్టారు. కారు యజమాని ఎవరా అని ఇప్పుడే ఎంక్వయిరీ మొదలుపెట్టబోతున్నాను, మీ పేరేమిటి అన్నారు?".

"డాక్టర్ విశాల్! కారు యజమాని నా స్నేహితుడు. ఏదో అర్జెంటు పని వుండి తీసుకున్నాను. బ్రేక్ ఆయిల్ చూసుకోలేదు. బ్రేకులు ఫెయిల్ అయినయ్. పాపం అతనెవరో లాయర్ అనుకుంటాను, కాళ్ళు విరిగిపోయాయి. అది చూడగానే నేనిక రూల్సూ రెగ్యులేషన్సూ ఆలోచించలేదు. ఒక డాక్టరుగా అతడిని నా నర్సింగ్‌హోంకి తీసుకొచ్చాను. ఇన్‌స్పెక్టరుగారూ మీ రొప్పుకుంటే ఇంకో రెండు నిమిషాల్లో ఆపరేషన్ ప్రారంభిస్తాను. తరువాత నేనే స్వయంగా వచ్చి మీకు లొంగిపోతాను".

ఇన్‌స్పెక్టర్ నొచ్చుకుంటున్నట్టు "అంత మాట అనకండి" అన్నాడు. "అరెస్ట్ అనేది కేవలం ఫార్మాలిటీయే. దానితోపాటు బెయిల్ పేపర్లు కూడా సిద్ధంగా వుంచుతాను. మీరు చేయాలని చేసిన నేరం కాదు కదా. స్నేహితుడి కారు బ్రేకులు ఫెయిల్ అయితే దానికి మీరేం చేయగలరు?".

"మీరు నా మీద ఇంత కన్సిడరేషన్ చూపిస్తున్నారంటే నాకు ఎలా థాంక్స్ చెప్పాలో అర్థం కావటం లేదు".

"మీరు మాకు థాంక్స్ చెప్పటం కాదు. మేమే మీకు చెప్పాలి డాక్టర్‌గారూ, ఆక్సిడెంట్ అనగానే బెదిరిపోకుండా మీరే పేషెంట్‌ని తీసుకెళ్ళి ఈ పరిస్థితుల్లో కూడా స్వయంగా ఆపరేషన్ టేకప్ చేయబోతున్నారంటే అది మీ మానవతా వాదాన్ని తెలుపుతోంది. పోతే మీ కారుని మాత్రం జనం బాగా పాడు చేశారు"

"పోనీలెండి, నేను చేసిన యాక్సిడెంట్‌కి అది శిక్ష అనుకుంటాను. నా స్నేహితుడికి ఆ ఖర్చులు నేనిస్తా" అని ఫోన్ పెట్టేశాడు.

ఆ తరువాత కార్డ్‌లెస్ ఫోన్ టేబిల్ మీద వుంచి శివశంకరం దగ్గిరగా వచ్చాడు. అతడి రెండూ కాళ్ళూ పరిశీలించి అసిస్టెంట్‌తో "కుడి కాలు ఫర్వాలేదు. స్టీల్ రాడ్ వేస్తే అతుక్కోవటానికి ఆర్నెల్లు పట్టొచ్చు. ఎడమకాలు మాత్రం తీసెయ్యాలి. ఏర్పాటు చెయ్యి" అన్నాడు.

అసిస్టెంట్ వెళ్ళిపోయాచు.

ఒంటరిగా ఆపరేషన్ టేబిల్ మీద పడుకునివున్న శివశంకరం తల దగ్గిరకి వచ్చి నిలబడి అతడి మొహంలోకి చూస్తూ ......

అప్పుడు విశాల్ నవ్వాడు ...... క్రూ రంగా... విలాసంగా ...... శంకరానికి మాట్లాడటానికి సత్తువ లేదు. అలాగే చూస్తూ వుండిపోయాడు. విశాల్ తాపీగా అన్నాడు "ఇదే పని నేను గూండాలచేత చేయిస్తే ఏ లక్ష రూపాయలో ఖర్చయ్యేది. కొద్దిగా రిస్కు తీసుకుని నేనే చేశాను. స్వయం కృషి మీద నాకు నమ్మకం ఎక్కువ. అయినా తన శత్రువు కాళ్ళు తానే స్వయంగా నరికే అవకాశం ఎంతమంది కొస్తుంది. చెప్పు? కాలు నిజానికి తీసేయక్కర్లేదు కానీ తీసేస్తున్నాను".

ఆపరేషన్ పరికరాల్తోపాటు ఎముకని కోసే రంపం పట్టుకుని రాజు ప్రవేశిస్తూ వుండగా విశాల్ పూర్తిచేశాడు. "ఇతని పేరు రాజు. గుర్తు పట్టావనుకుంటాను" మళ్ళీ నవ్వాడు.

" నేను నీ మీద కక్ష గట్టటానికి కారణం రాజు. నా కారు బ్రేకులు నేనే పాడుచేసుకుని ఆక్సిడెంట్ చేశానని ఏ కోర్టులో నిరూపించగలవు? ఏ ఃఆఏఒఔ ఀఊఃఊఉ్యా ఆఈ కూడా మాస్టర్ ప్లాన్‌ని వూహించి వుండదే ".

"నేను ఏ కోర్టులోనూ నిరూపించలేను. ఏ కోర్టు కూడా నమ్మదు" అన్నాడు శివశంకరం నిస్సహాయంగా.

నర్సింగ్ హోంలో ఒక కాలు ఆపరేట్ చేయబడి, మరొక కాలు తొలగించబడి వున్నాడు. అతడు ప్రక్కన స్టూల్‌మీద కూర్చుని వుంది మధూహ.

పక్కనే సోమం వున్నాడు. అది విశాల్ క్లినిక్ అవటం ఐరనీ.

"అతడే స్వయంగా ఆపరేట్ చేసి ఏ లోపం లేకపోయినా నాకాలు తీసేశాడు. అయినా ఇదంతా కక్ష గట్టి చేశాడని నేను నిరూపించలేను. కారు బ్రేకులు పనిచేయకపోవటం అనేది క్షమార్హం. కోర్టులో అతడికి కాస్త జరిమానా పడవచ్చు. అదీ పడకపోవచ్చు. రాజు అతడి అసిస్టెంట్ అనీ అతడికి లాయర్ నోటీస్ ఇవ్వటం వల్ల కక్ష గట్టి ఇంత పెద్ద నేరానికి పూనుకున్నాడని కోర్టులో చెప్పలేను ఎంత విచారకరమైన స్థితి".

"కానీ ఇది ఘోరం, అన్యాయం, అక్రమం" అంది మధూహ.

"అవును కానీ చాలా న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా చట్టంలోని లొసుగులు ఆధారంగా చేశాడు. అతడన్నట్టు ఇది మాస్టర్ ప్లాన్. ఏ శాడిస్ట్ కూడా ఇంత క్రూరంగా ఆలోచించి వుండడు మధూహగారూ, అతడిని చూస్తే నాకెందుకో మామూలు మనిషిలా కనిపించడం లేదు. అతడో సైకిక్‌లా వున్నాడు. ఉట్టి సైకిక్ అయితే ఫర్వాలేదు కానీ విపరీతమైన తెలివితేటలున్న సైకిక్‌లా కనబడుతున్నాడు."

మధూహ ఒళ్ళు జలదరించింది.

శంకరం చెప్పిన దృశ్యాన్ని ఆమె వూహించుకోగలుగుతోంది. చాలా పుస్తకాల్లో ఆమె చదివింది. సినిమాల్లో చూసింది. తన దారికి అడ్డొచ్చిన వారిని తొలగించుకోవటానికి పాకలను తగలబెట్టించటం, లారీల్తో గుద్దించి చంపించడం అన్నీ కథల్లోనే జరుగుతాయనుకుంది కానీ ఇంత దారుణంగా ప్రత్యక్షంగా నవ్వుతూ ప్రాణాలు తీసే కిరాతకులు వుండగలరని ఇప్పుడే చూస్తోంది.

ఆమె మనసులో భావాలు గ్రహించినట్టు శంకరం అన్నాడు.

“ నేను తిరిగి లేచి కనీసం ఒంటికాలితోనైనా లేచి నడవటానికి కనీసం ఆర్నెల్లు పడుతుంది. ఈ లోపులో మరో లాయర్‌కి కేసు అప్పగించినా సరే. లేకపోతే....” ఆగి నెమ్మదిగా అన్నాడు “ఇలాంటి కిరాతకులతో గొడవ ఎందుకు అనుకుంటే మీ ఇష్టం”.

ఆ గదిలో నిశ్శబ్దం కూడా ఆమె ఏం చెపుతుందా అన్న ఉత్సుకతతో చూసింది. గాలి స్తబ్దంగా వుంది. ఆమె సోమం వైపు చూసింది. అతడు తల దించుకుని అభావంగా కూర్చుని వున్నాడు ఎప్పటిలాగే.

పొగలొచ్చే వరకు అచలానికీ, అగ్నిపర్వతానికీ తేడా తెలీదు.

## 7

“నమస్కారమండీ”

డాక్టర్ విశాల్ తలెత్తి చూశాడు. లోపలికి వస్తున్న లక్ష్మిని చూడగానే అతడి మొహంలో ప్రసన్నత తొంగి చూసింది. క్లయింట్స్ అందరికీ అతడో గాడ్‌ఫాదర్‌లా కనిపిస్తాడు.

అతడి కళ్ళు ప్రేమతో దయనీ ఆప్యాయతనీ వర్షిస్తున్నట్టు వుంటాయి. అదంతా సహజసిద్ధంగా జరిగిపోతుంది.

ఆమె నిలబడే “నా రిపోర్ట్స్ పరిశీలించి ఈ రోజు ప్రెగ్నెన్సీ రిజల్ట్ చెపుతామన్నారు” అంది.

“అవును” అంటూ ఇంటర్‌కమ్‌లో మాట్లాడి “ఇంకో అరగంటలో వస్తాయి కూర్చోండి” అన్నాడు.

ఆమె కూర్చుంది. కొంచెంసేపు మామూలు సంభాషణ జరిగాక అతడు అడిగాడు “మీ మనసులో ఏదో బాధ వుంది ఏమిటది?”.

ఆకస్మాత్తుగా అతడా ప్రశ్న అడిగేసరికి ఆమె బిత్తరపోయింది. మాట్లాడలేదు.

“చూడు లక్ష్మీ! ఏకవచనంలో సంభోదిస్తున్నానని ఏమీ అనుకోకు. నేను పేరుకి డాక్టర్నే గానీ ఎంతో మంది ఎన్నో సమస్యలతో నాదగ్గరికి వస్తూ వుంటారు. అన్నయ్యా మావయ్యా, డాడీ, ఫ్రెండ్, ఫిలాసఫర్ అందర్నీ నాలో చూసుకుంటారు. అందరి సమస్యల్నీ పరిష్కరించటం కోసమే నన్ను పుట్టించాడేమో దేవుడు అనుకుంటూ వుంటాను. అందుకే నేను వివాహం కూడా చేసుకోలేదు. బాధ అనేది మరొకరికి చెప్పుకుంటే తగ్గుతుంది. అవతలి వ్యక్తి అనుభవజ్ఞుడైతే అతడి తిట్టు కూడా నీకు దీవెనగా మారి దారి చూపిస్తుంది. చెప్పు లక్ష్మీ! నీ మనసులో బాధ ఏమిటో చెప్పు”.

ఆమె ఇంతవరకూ ఎవరికీ చెప్పుకోలేదు.

అదే గుండెల్లో పెరిగి పెరిగి, ఒక రచనగా బయటకొచ్చింది. కానీ ఏదో అసంతృప్తి. ఒంటరితనపు ఆలోచనల దిగులు.

ఎవరికయినా చెప్పుకుంటే బాధ తగ్గుతుంది. అందుకే మనసు విప్పి మాట్లాడటానికి ఒకరయినా ఆత్మీయులు వుండాలంటారు. అలాంటి ఆత్మీయులు ఎవరూ ఇంతవరకూ తనకి తారసపడలేదు. ఆమెకు చెప్పుకోవాలనిపించింది.

అంతా.....

మొత్తమంతా....

కానీ....

చెప్పబోతూ ఆమె ఆగింది.

తమ సమస్యలు పక్కవారికి చెప్పుకోవటం కోసం మనిషి స్నేహితుల్ని వెతుక్కుంటాడు. చెప్పుకుంటే బాధ తగ్గుతుందన్నది పొరపాటు. అవతలివారు ధైర్యం చెబుతారనో, తనపట్ల సానుభూతి చూపించాలనో ఒక కోరిక మనసులో వుంటుంది. కేవలం అలా చెప్పుకుంటే అవతలివారికి వినే వుత్సాహం వుండదని దీనికి నేనేం చేయాలి? అని సలహా అడిగి ఎదుటి వారికి పెద్దరికం ఆపాదిస్తారు. అవతలివారు కూడా జ్ఞానులూ అనుభవజ్ఞులూ అయివుండరు. తమకు తోచింది చెపుతారు.

అదెలాగూ ఆచరణలోకి రాదు కాబట్టి ఈ వ్యవహారమంతా చెప్పటం వినటం అనే చట్రంలో తిరుగుతూ వుంటుంది.

ఆమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్నాడు డాక్టర్ "మీరేమీ సంశయించకండి, మీ సమస్యకు నా జవాబే మీకు శ్రీరామరక్ష" అన్నాడు.

ఏదో మనో విశ్లేషణ పుస్తకంలో వాక్యం ఆమెకు గుర్తొచ్చింది "నీ పక్కింటి వ్యక్తికి నీలోని బాధ చెప్పుకుంటే  నీ మనసు ఇంటిమీద ఆ మేరకు అతడికి అధికారం ఇచ్చావన్నమాట".

ఆ వాక్యం ఆ సమయంలో గుర్తొచ్చి ఆమెని రక్షించింది. ఆమెని మరింత రక్షించటానికా అన్నట్టు అదే సమయానికి రాజు ఆమె తాలూకు రిపోర్టులు తెచ్చి బల్లమీద పెట్టాడు.

డాక్టర్ విశాల్ వాటిని పరీక్షించసాగాడు.

అతడేం రిజల్టు చెపుతాడో అని ఆమె వూపిరి బిగపట్టి ఎదురు చూడసాగింది. రెండు నిముషాల తరువాత తలెత్తి "మీరు తల్లి కాబోతున్నారు" అని చెప్పాడు.

## 8

"రా, నీ కోసమే చూస్తున్నాను. ఒక ఇంటరెస్టింగ్ కేస్ గురించి మా డాక్టర్ ఒకామె చెప్పింది. వెంటనే అది నీకు చెప్పాలనిపించింది" ప్రహసిత్ అన్నాడు.

మధూహ ఎదుటి కుర్చీలో కూర్చుంటూ " ఏమిటది?" అని అడిగింది.

" మా డాక్టర్ దగ్గిరకి సంవత్సరం క్రితం ఒక జంట వచ్చారు. వారికి అయిదు సంవత్సరాల్నుంచి పిల్లలు కలుగలేదు. ఆమె రకరకాల ట్రీట్‌మెంట్లు ప్రయత్నించింది .అయినా సంతానం కలుగలేదు".

"అయితే?"

"ఈ ప్రకటన చూడు. ఇదే ఆ జంట" అంటూ పేపర్ చూపించాడు. అందులో దంపతుల ఫోటో వుంది ఈ విధంగా వ్రాసి వుంది.

" కృతజ్ఞతలు

అయిదు సంవత్సరాలుగా సంతానం లేకపోవటంతో మేము డాక్టర్ విశాల్‌గారిని ఆశ్రయించాము. ట్రీట్‌మెంట్ తీసుకున్న మూడు నెలల్లో మాకోరిక నెరవేరింది. మా చిన్నాడికి విశాలి అని పేరు పెట్టుకున్నాము. మా ఇంటిలో దీపం వెలిగించిన డాక్టర్ విశాల్ గారికి కృతజ్ఞతలు పత్రికాముఖంగా తెలియజేసుకుంటున్నాము".

మధూహ పేపరు మడుస్తూ "ఇందులో విశేషం ఏముంది?" అంది.

" ఇలాంటి కేసుల్ని నువ్వు పరిశోధిస్తున్నావని తెలుసు కదా. అందువల్ల ఆ దంపతుల్ని అంతకు ముందు ట్రీట్ చేసిన లేడీ డాక్టర్‌ని మరికొన్ని వివరాలు అడిగాను. ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి".

ఏమిటన్నట్టు చూసింది మధూహ ఉద్వేగంగా.

"ఈ కేసులో డాక్టర్ విశాల్ ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ చేశాడట. ఆ.ఒ.ఐ అంటే భర్త తాలూకు స్పెర్మ్ భార్యలో ప్రవేశపెట్టటం".

అడగటానికి సిగ్గేసింది కానీ అనుమానం తీర్చుకోవటానికి అడిగింది "భర్త స్పెర్మ్ బయటనుంచి ప్రవేశపెట్టటమెందుకు? ప్రకృతి సిద్ధమైన పద్ధతులుండగా?"

ఇంగ్లీషులో అడిగినా కూడా ఆమె మొహం ఎర్రబడింది. అయితే ప్రహసిత్ దాన్ని గమనించలేదు. ఒక డాక్టర్ కాబట్టి మామూలుగా చెప్పుకుపోయాడు.

" కొన్ని కేసుల్లో మొగవాడి వీర్యం స్త్రీ అండాన్ని చేరుకోలేదు. అటువంటప్పుడు భర్త స్పెర్మ్‌ని ఒక ఇంజెక్షన్‌లోకి ఎక్కించి దాన్ని భార్యలోకి ప్రవేశపెడతారు. మామూలుకన్నా ఎక్కువ శక్తి వంతంగా ఈ ప్రక్రియ పనిచేస్తుంది. డాక్టర్ విశాల్ చేసిందిదే"

“ఇందులో పరిశోధించవలసిందేముంది?”

“ ఇక్కడే ఒక చిన్నవిషయం బయటపడింది. ఇది సంవత్సరం క్రిందటి మాట. అప్పుడు డాక్టర్ విశాల్‌కి ఇంత ప్రాక్టీసు లేదు. మూడు గదుల చిన్న ఇంటిలో వుండేది క్లినిక్. అక్కడ మంచి బాత్‌రూమ్ సౌకర్యం కూడా లేదట. అందుకని స్పెర్మ్‌ని ఇంటిదగ్గరే కలెక్ట్ చేసుకుని రమ్మని చెప్పాడట. ఆ భర్త ప్రొద్దున్న అయిదింటికి దాన్ని తీసి ఒక ఇంజెక్షన్ బాటిల్‌లో భద్రపరిచాడు. తొమ్మిదింటికి భార్యా భర్తలు స్కూటర్ మీద క్లినిక్‌కి వెళ్ళారు. ఆమె వెనుక సీటు పై కూర్చొని కర్చీఫ్‌లో ఆ బాటిల్ పట్టుకుంది” అని ఆగి నెమ్మదిగా పూర్తి చేశాడు “మొగవాడి వీర్యంలో జీవోత్పత్తి చేసే కణాలు మరణించటానికి మూడు గంటల కాలమూ, ఆ మాత్రం ఎండా చాలు.
కానీ ఆమె గర్భవతి అయింది”.

“మైగాడ్” అదిరిపడింది.

“ ఒక విషయం గమనించావా? డాక్టర్ విశాల్ దాదాపు ప్రతిరోజూ పత్రికల్లో తన క్లినిక్ వల్ల సంతానం కలిగినట్టు ప్రకటించుకుంటూ వుంటాడు. కేవలం ఒక్క డాక్టర్ వల్ల ఇంతమంది దంపతులకు సంతానం కలగటం అసంభవం. అందువల్ల లైబ్రరీకి వెళ్ళి గత ఏడాది తాలూకు ప్రకటనలన్నీ సేకరించాను”.

మధూహ నిరత్తురాలై “వ్వాట్ ” అంది.

ప్రహసిత్ నవ్వాడు. “అవును, ఏదైనా ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు లోతుకంటూ చేయాలి కదా” అంటూ డ్రాయర్‌లోంచి పేపర్లు తీసి బల్లమీద పెట్టాడు.

“ఇందులో దంపతుల ఫోటోలు లేవు. కానీ కృతజ్ఞతలు చెప్తూ వ్రాసిన ఉత్తరాల అడ్రసులున్నాయి. ఉదాహరణకి ఈ రెండు అడ్రసులూ తీసుకో”.